ప్రజల చేతిలో

www.ayudamdaily.com

ఆయుధం

The Common People's Voice

ఆదివారం | నవంబరు 08, 2026 | సంపుటి : 7 | సంచిక : 133 | పేజీలు : 2

29న పద్మశాలీల కార్తీక మాస వనభోజనాలు

- కమలాపూర్‌లో పోస్టర్ ఆవిష్కరణ



2 లో

- తామే కట్టామని గొప్పలు చెప్పుకునేటోళ్లు అది కూలిపోతే మాత్రం బాధ్యత తీసుకోరా?
- హకీంపేటలో అగ్రి ఎక్స్‌పోను ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి

"కేసీఆర్ పదేళ్లలో కొడంగల్‌కు ఏమైనా ఇచ్చారా?. పదేళ్లపాటు కొడంగల్‌కు నీళ్లు, నిధులు, ప్రాజెక్టులు ఏమీ ఇవ్వలేదు. ప్రాజెక్టులకు భూములు కోల్పోతున్న వారికి ఎకరాకు రూ.20 లక్షలు ఇస్తున్నాం. ఆనాడు ఎకరాకు రూ.2 లక్షలు ఇచ్చేందుకు కూడా కేసీఆర్‌కు మనసొప్పలేదు. కొడంగల్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులపై తమ పత్రికల్లో విషం చిమ్ముతున్నారు. మూడేళ్లలో ఒక్కరోజు కూడా సెలవు తీసుకోకుండా ప్రజల కోసం పనిచేస్తున్నా"

– రేవంత్ రెడ్డి, సీఎం

మేడిగడ్డ వద్ద..
పాతిపెడతాం
అదే వాళ్లకు సరైన శిక్ష



పదేళ్లలో పాలమూరు జిల్లాలో ఏ ప్రాజెక్టును కేసీఆర్ పూర్తి చేయలేదని, పదేళ్లలో రూ.20 లక్షల కోట్ల బడ్జెట్ చేతికి వచ్చినా ప్రాజెక్టులు పూర్తి చేయలేదని రేవంత్ రెడ్డి ఆరోపించారు. తెలంగాణ వరప్రదాయినిగా మారే ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టును పక్కకు పెట్టారని, ప్రాజెక్టు పేరు మార్చి, స్థలం మార్చి, అంచనాలు పెంచి కాళేశ్వరం కట్టారని, కాళేశ్వరం ప్రాజెక్టు కేసీఆర్ హయాంలోనే కట్టారని, అప్పుడే కుప్పకూలిందని విమర్శలు చేశారు. కొడంగల్ నియోజకవర్గం హకీంపేటలో సీఎం పర్యటించారు. హకీంపేటలో అగ్రి ఎక్స్‌పో స్టాళ్లను పరిశీలించారు. రైతుమేళా, ఇండస్ట్రియల్ ఎక్స్‌పోను సీఎం ప్రారంభించారు. బహిరంగ సభలో మట్లాడుతూ గత ప్రభుత్వంపై నిప్పులు కురిపించారు. అనంతరం ఆదర్శ రైతులు, వ్యవసాయ శాస్త్రవేత్తలతో ముఖాముఖి కార్యక్రమంలో రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. కట్టామని చెప్పుకుంటారు కూలితే మాత్రం బాధ్యత తీసుకోరు ఎల్‌నినో విషయంలోనూ బీఆర్ఎస్ నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారని, దానివల్ల ప్రపంచవ్యాప్తంగా కరవు వస్తే తెలంగాణలోనే వచ్చినట్లు మాట్లాడుతున్నారని రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టును పక్కనుండి కట్టించానని హరీశ్‌రావు గొప్పగా చెప్పుకున్నారని, తన పేరు హరీశ్‌రావు కాదని, కాళేశ్వరరావు అని నాటి గవర్నర్‌తో భజన చేయించుకున్నారని ఎద్దేవా చేశారు. తామే కట్టామని గొప్పలు చెప్పుకున్న వాళ్లు ఇప్పుడు మేడిగడ్డ కూలిపోతే ఎందుకు బాధ్యత వహించట్లేదని నిలదీశారు.

పాలమూరు ను పట్టించుకున్నవాళ్లే లేరు

మేడిగడ్డ వద్ద వాళ్లను పాతిపెట్టడమే వాళ్లకు సరైన శిక్ష అని సీఎం నిప్పులు చెరిగారు. మేడిగడ్డ బ్యారేజీలో నీళ్లు నిల్వ లేకపోతే కన్నెపల్లి పంపులు పనిచేయవని, అన్నారం, సుందిళ్ల ప్రాజెక్టుల్లోనూ నీళ్లు నిల్వ చేయలేని దుస్థితి అని పేర్కొన్నారు. కాళేశ్వరంపై బీఆర్ఎస్ నేతలు అబద్ధాలు చెప్పి ప్రజలను మభ్య పెడుతున్నారని అన్నారు. మేడిగడ్డతో సంబంధం లేకుండా నీళ్లు ఎత్తిపోసేది ఉంటే మరి అది ఎందుకు కట్టినట్లు? అని నిలదీశారు. పదేళ్లపాటు పాలమూరు జిల్లాను పట్టించుకున్నవాళ్లే లేరని వెల్లడించారు.

లగచర్ల విషయంలోనూ అబద్ధాలు చెప్పి రైతులను భయపెట్టారని సీఎం ఆరోపించారు. దిల్లీ నొయిడా తరహాలో హైదరాబాద్ లగచర్ల అభివృద్ధి చెందుతుందని, లగచర్లలో పెట్టుబడులు పెట్టేందుకు పెద్దపెద్ద కంపెనీలు వస్తున్నాయని తెలిపారు. హకీంపేటలో 250 ఎకరాల్లో ఎడ్యుకేషన్ హబ్ నిర్మిస్తున్నామని స్పష్టం చేశారు. ఉన్నత విద్యా సంస్థలన్నీ ఒకేచోట ఉండేలా హకీంపేట ఎడ్యుకేషన్ హబ్ నిర్మిస్తున్నామని వెల్లడించారు. తాండూరు కందిపప్పు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిందని కొనియాడారు. ఇప్పుడు తాండూరు కందిపప్పు చాలా దేశాలకు ఎగుమతి అవుతోందని ఆనందం వ్యక్తం చేశారు.

నీటిని పాదుపుగా వాడుకోవాలి

రాబోయే రోజుల్లో ఎండలు మరింత తీవ్రం అవుతాయని, యాసంగిలో ఆరుతడి పంటలు మాత్రమే వేయాలని, విపక్ష నేతల తప్పుడు మాటలు నమ్మి మోసపోవద్దని రైతులకు రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. జులై వరకు వర్షాలు వచ్చే అవకాశాలు లేవని ఉన్న నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు. అందరం కలిసికట్టుగా ఉండి ఎల్‌నినోను ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. తమను గెలిపించలేదని ప్రజలపై కేసీఆర్ కుటుంబం పగబట్టిందని, ఓటు వేయలేదనే కక్షతో అబద్ధాలు చెప్పి ఆగం చేయాలని చూస్తున్నారని పేర్కొన్నారు.



సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

కమలాపూర్, ఆయుధం: హైదరాబాద్ లో పద్మశాలీ ఆత్మ గౌరవ భవన నిర్మాణానికి స్థలం కేటాయించడమే కాకుండా, ప్రభుత్వం రూ.5 కోట్లు మంజూరు చేసిన సందర్భంగా, కమలాపూర్ మండల కేంద్రంలో కమలాపూర్ పట్టణ పద్మశాలి యువజన కమిటీ ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, హుజరాబాద్ నియోజకవర్గ ఇన్చార్జి ఓడితల ప్రణవ్ బాబు చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. తవుటం ఝాన్సీ రాణి రవీందర్ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలోని పద్మశాలీల అభ్యున్నతి కోసం పాటుపడుతుందని.. పద్మశాలీ భవన నిర్మాణానికి రూ.5 కోట్ఐలు మంజూరు చేసిందని తెలిపారు. ఈ సందర్భంగా పద్మశాలి సమాజం తరపున సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్ కు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం హనుమకొండ ఎర్రగట్టు గుట్ట వద్ద నవంబర్ 29వ తేదీ రోజున నిర్వహించే కార్తీక మాస వనభోజనాల కార్యక్రమ పోస్టర్ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు బచ్చు ఆనందం, రాష్ట్ర ఉపాధ్యక్షులు వైద్యం రాజగోపాల్, మండల అధ్యక్షులు బొప్ప శివశంకర్, రాష్ట్ర నాయకులు పులికంటి రాజేందర్, జిల్లా నాయకులు కేదాసి వెంకటేశ్వర్లు, చేనేత సంఘ అధ్యక్షులు బైరి జనార్దన్, క్యాతం రవీందర్, మెండు రాంబాబు, చేరాల సారంగం, వెంకట్ రాజం పట్టణ యూత్ అధ్యక్షులు ఆడెపు శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి మార్గం చైతన్య, చేనేత సంఘ మేనేజర్ సామల దామోదర్, చేనేత కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



క్రమశిక్షణే సైనికుడిని యోధుడిగా మారుస్తుంది

- రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్

జాతీయం, ఆయుధం: కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ వాయుసేన సిబ్బందితో కలిసి దీపావళి వేడుకలు చేసుకున్నారు. పశ్చిమ బెంగాల్‌లోని బాగ్‌డోగ్రా ఎయిర్‌ఫీల్డ్‌లో నిర్వహించిన వేడుకల్లో సైనికులకు ఆయన మిఠాయిలు పంచిపెట్టారు. అనంతరం మాట్లాడుతూ.. భారత వైమానిక దళ సిబ్బంది ధైర్యం, క్రమశిక్షణ, అంకితభావాన్ని ప్రశంసించారు. మన సాయుధ దళాలు సరిహద్దుల్లో రేయింబవళ్లు కాపలాగా ఉండటం వల్లే, దేశ ప్రజలు ప్రతి పండగను ఆనందంగా, స్వేచ్ఛగా జరుపుకొంటున్నారని తెలిపారు. వారు చూపే ధైర్యం, నిస్వార్థ సేవకు యావత్ దేశం ఎంతో గర్వపడుతోందన్నారు. 'ఆపరేషన్ సిందూర్'తో మన వాయుసేన శక్తి ప్రపంచానికి తెలిసిందన్నారు. 'సైనికులలో ధైర్యం, క్రమశిక్షణ లేకపోతే అత్యంత అధునాతన సాంకేతిక పరిజ్ఞానం ఉన్నా అది నిష్ప్రయోజనమే. మన సాయుధ దళాలు క్రమశిక్షణకు మారుపేరు. అదే ఒక సాధారణ సైనికుడిని అసాధారణ యోధుడిగా మారుస్తుంది. అదే సమయంలో డ్రోన్లు, సైబర్ సెక్యూరిటీ సామర్థ్యాలతో సహా అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానాలతో సాయుధ దళాలను సన్నద్ధం చేయాల్సిన అవసరం ఉంది. భవిష్యత్ సవాళ్లను సమర్థంగా ఎదుర్కోవడానికి మన సైనికులు డ్రోన్లను ప్రయోగించడం, సైబర్ సెక్యూరిటీ వంటి కొత్త యుద్ధ పద్ధతులను నేర్చుకుంటున్నారు. రాబోయే రోజుల్లో సాంకేతికనే ఆయుధంగా (మిగతా 2లో..)



వరంగల్ ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు

- వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య

వరంగల్, ఆయుధం: దీపావళి పండుగను పురస్కరించుకుని తెలంగాణ రాష్ట్ర ప్రజలతో పాటు వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలందరికీ వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. చెడుపై మంచి, చీకటిపై వెలుగు, అజ్ఞానంపై జ్ఞానం సాధించిన విజయానికి ప్రతీకగా దీపావళి పండుగను జరుపుకుంటామని పేర్కొన్నారు. దీపావళి దీపాల వెలుగులు ప్రతి ఇంటా ఆనందం, ఆప్యాయత, సిరిసంపదలను నింపాలని, ప్రతి కుటుంబంలో సుఖసంతోషాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. ఈ పర్వదినం ప్రజల జీవితాల్లో నూతన ఆశలు, సరికొత్త వెలుగులు నింపాలని, ప్రతి ఒక్కరికీ ఆయురారోగ్యాలు, శాంతి సౌభాగ్యాలు కలగాలని కోరుకున్నారు. వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తూ మరింత ప్రగతిపథంలో పయనించాలని ఆకాంక్షించారు. పండుగ వేడుకలను ఆనందోత్సాహాల మధ్య జరుపుకుంటూనే పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని, కాలుష్యాన్ని తగ్గించేలా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ముఖ్యంగా చిన్నారులు బాణసంచా కాల్చే సమయంలో తల్లిదండ్రులు, పెద్దలు అప్రమత్తంగా ఉండి తగిన భద్రతా చర్యలు తీసుకోవాలని కోరారు. వెలుగుల పండుగ దీపావళి ప్రతి ఒక్కరి జీవితాల్లో కొత్త ఉత్సాహాన్ని, సానుకూలతను నింపాలని, రాష్ట్ర ప్రజలందరూ కుటుంబ సభ్యులతో కలిసి సంతోషంగా, సురక్షితంగా పండుగను జరుపుకోవాలని ఎంపీ డాక్టర్ కడియం కావ్య ఆకాంక్షించారు.



మనిషి జీవితాన్ని మార్చేది
పుస్తక పఠనమే

వరంగల్ పార్లమెంటు సభ్యురాలు కడియం కావ్య

హనుమకొండలో ఘనంగా నవచేతన పుస్తక ప్రదర్శన ప్రారంభం

హనుమకొండ, ఆయుధం: పుస్తక పఠనమే మనిషి జీవితాన్ని మారుస్తుందని వరంగల్ పార్లమెంటు సభ్యురాలు కడియం కావ్య తెలిపారు. కనీసం రోజుకు ఒక పేజీ అయినా చదవడం అలవాటు చేసుకోవాలని, తద్వారా మనిషి జీవన విధానంలో ఎన్నో మార్పులు చోటు చేసుకుంటాయని పేర్కొన్నారు. హనుమకొండ అశోక కాంప్లెక్స్ లో నవచేతన (విశాలాంధ్ర) బుక్ హౌస్ లో నెలరోజుల పాటు నిర్వహించనున్న పుస్తక ప్రదర్శనను ఎంపీ కడియం కావ్య ముఖ్యఅతిథిగా విచ్చేసి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కడియం కావ్య మాట్లాడుతూ... జాతీయ పుస్తక వారోత్సవాలు, గ్రంథాలయ దినోత్సవం సందర్భంగా ఈ పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేయడం అభినందనీయం అన్నారు. తాను విద్యార్థిగా ఉన్నప్పటి నుంచి నిరంతరం పుస్తకాలు చదువుతానని, అనేక సార్లు నవచేతన బుక్ హౌస్ ను సందర్శించి పుస్తకాలు సేకరించానని తెలిపారు. ప్రస్తుత కాలంలో పిల్లలు, పెద్దలు టెక్నాలజీ ద్వారా జ్ఞానాన్ని పొందడానికి ప్రయత్నం చేస్తున్నారని, కానీ హార్డ్ కాపీ ద్వారా చదవడం వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయని తెలిపారు. పుస్తకాలు మనిషి జీవితాన్ని సంపూర్ణంగా మార్చివేస్తాయని, ప్రతి ఒక్కరినీ విజ్ఞాన వంతులుగా తీర్చిదిద్ది ఉన్నతంగా నిలబెడుతాయని తెలిపారు. మనిషి నిత్య జీవితంలో పుస్తకాలను చదువుకోవడం వల్ల మన పూర్వీకుల జీవితాలను, వారి అనుభవాలను మన జీవితంలో పాటించే అవకాశం ఉందని వరంగల్ పార్లమెంటు సభ్యురాలు కడియం కావ్య తెలిపారు. బాబాసాహెబ్ డాక్టర్ అంబేద్కర్, మహాత్మ గాంధీ, నెహ్రూ రచనలు చదవడం వల్ల దేశ పరిస్థితులు, రాజకీయాలు తెలుసుకోగలిగానని వివరించారు. దేశంలో అంటారని తనం ఆర్థిక సమస్యలు మత మైనార్టీ ల సమస్యలు ఎలావస్తున్నాయో తెలుసుకొని వాటికి ఎలా రాజ్యాంగం పరిష్కారం చేయాలో పాలన ద్వారా తెలుసుకున్నానని అన్నారు. నవచేతన ఆధ్వర్యంలో నెల రోజుల పాటు ఏర్పాటు చేసిన ఈ పుస్తక ప్రదర్శనను విద్యార్థులు, పుస్తక ప్రియులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీ సూచించారు. ఈ సందర్భంగా పుస్తక ప్రదర్శనలో పాల్గొన్న ఎంపీ కావ్య నిర్వహకులు ఏర్పాటు చేసిన అనేక పుస్తకాలను పరిశీలించి పలు పుస్తకాలను స్వయంగా కొని తన మిత్రుల చేత కేశవరెడ్డి రాసిన అన్ని పుస్తకాలను కొనాలని కోరడంతో వారు కొనుగోలు చేశారు. ఈ కార్యక్రమంలో నవచేతన గవర్నింగ్ బాడీ సభ్యురాలు నేదునూరి జ్యోతి, బుక్ హౌస్ మేనేజర్ ఎర్ర నాగరాజు, రచయిత ఎలుగటి తిరుపతి రెడ్డి, న్యాయవాది బండి మొగిలి, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శులు తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్, టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా అధ్యక్షులు గడ్డం కేశవమూర్తి, రాష్ట్ర హౌసింగ్, వెల్ఫేర్ కన్వీనర్ వల్లాల వెంకటరమణ, గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, ఐజేయూ జాతీయ కౌన్సిల్ సభ్యులు గడ్డం రాజిరెడ్డి, తోట సుధాకర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు గాడిపెళ్ళి మధు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.వేణుమాధవ్, సిపిఐ జిల్లా నాయకులు నేదునూరి రాజమౌళి, ఎన్. అశోక్ స్టాలిన్, మునిగాల బిక్షపతి, మాజీ కార్పొరేటర్ మాధవి, రచయితలు విద్యా దేవి, కాసర్ల రంగారావు, పాత్రికేయులు మంచాల రాజు, ఎండి.ఉస్మాన్ పాషా, తాండూరి గోపి, కుక్కల రాజు, ఉస్నగిరి శ్రీకాంత్, రాజేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.







2 లో

ప్రత్యేక విద్యార్థుల ప్రతిభకు సీపీ ప్రోత్సాహం

- హ్యాండ్‌మేడ్ వస్తువుల కొనుగోలు

హనుమకొండ, ఆయుధం: హనుమకొండ బాలసముద్రంలోని మల్లికాంబ మనోవికాస కేంద్రానికి చెందిన ప్రత్యేక విద్యార్థులు, కేంద్రం వ్యవస్థాపకురాలు రామలీల, ఈసీ సభ్యుడు కల్యాణ్‌తో కలిసి హనుమకొండ పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో ప్రత్యేక స్టాల్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత, ఐపీఎస్ స్టాల్‌ను సందర్శించి, ప్రత్యేక విద్యార్థులు స్వయంగా తయారుచేసిన హ్యాండ్‌మేడ్ వస్తువులను కొనుగోలు చేశారు



ఇందిరమ్మ ఇంట్లో దీపావళి

- పోస్టర్ ఆవిష్కరించిన అధికారులు

ములుగు, ఆయుధం: 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' కార్యక్రమంలో అన్ని గ్రామపంచాయతీలో పూర్తయిన ఇండ్లలో కార్యక్రమం నిర్వహించుటకై 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' సంబంధించిన పోస్టర్లను అడిషనల్ కలెక్టర్ లోకల్ బాడీ యం.సంపత్ రావు ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ములుగు ప్రాజెక్టు డైరెక్టర్ జి.కృష్ణప్రసాద్, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు. ఈనెల 8 నుంచి దీపావళి కార్యక్రమం అన్ని గ్రామాలలో విజయవంతంగా నిర్వహించుటకు ఎంపీడీవోలకు, ఎంపీవోలకు, అసిస్టెంట్ ఇంజనీర్లకు, హౌసింగ్, పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్‌లు, వార్ మెంబర్లకు, మండల స్థాయి /గ్రామస్థాయి ప్రజా ప్రతినిధులకు ఆదేశాలు జారీ చేశారు.



29న పద్మశాలీల కార్తీక మాస వనభోజనాలు

■ కమలాపూర్‌లో పోస్టర్ ఆవిష్కరణ

కమలాపూర్, ఆయుధం: ఈనెల 29న పద్మశాలీల కార్తీక మాస వనభోజనాలు నిర్వహిస్తున్నట్లు తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు బచ్చు ఆనందం తెలిపారు. ఎర్రగట్టుగుట్ట వద్ద జరుగు కార్తీక మాస వనభోజనాల పోస్టర్ ను శనివారం కమలాపూర్ మండల కేంద్రంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బచ్చు ఆనందం మాట్లాడుతూ... ఎర్రగట్టుగుట్ట వద్ద 29 రోజున జరుగు కార్తీక మాస వనభోజనాల కార్యక్రమాన్ని కమలాపూర్ మండలకుల బాంధవులు పద్మశాలీలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు వైద్యం రాజగోపాల్, రాష్ట్ర కార్యదర్శి తవుటం రవీందర్, కమలాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తవుటం ఝాన్సీ రాణి, రాష్ట్ర కోఆర్డినేటర్ పులికంటి రాజేందర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొప్ప శివశంకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి కేదాసి వెంకటేశ్వర్లు, చేనేత సహకార సంఘం అధ్యక్షులు బైరి జనార్దన్, కమలాపూర్ పట్టణ యూత్ అధ్యక్షులు ఆడెపు శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి మార్గం చైతన్య, మెండు రాంబాబు, చేరాల సారంగం, తుమ్మ రాజు తుమ్మ రఘుపతి, అనిల్, చందనాల నాగరాజు, గాజుల మల్లేశం, చేరాల వెంకట్రాజం, చేనేత సహకార సంఘ మేనేజర్ సామల దామోదర్, చేనేత కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



సమయస్ఫూర్తితో స్పందించి నిండు ప్రాణాన్ని కాపాడిన బ్లూకోల్ట్ సిబ్బంది

■ నగదు రివార్డులతో అభినందించిన వరంగల్ సీపీ ఎన్.శ్వేత, ఐపీఎస్

హనుమకొండ, ఆయుధం: హనుమకొండ కేయూ పోలీస్ స్టేషన్ పరిధిలోని గుండ్ల సింగారం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి తన ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపం చెంది, శుక్రవారం సాయంత్రం తన ఇంట్లోవాళ్లకి చెప్పకుండా బయటకు వెళ్లిపోయి, చాలా సమయం గడిచినా ఇంటికి తిరిగి రాకపోవడంతో ఆందోళనకు గురైన అతని భార్య డయల్ 112 ద్వారా పోలీసులకు సమాచారం అందించింది. వెంటనే స్పందించిన కేయూ పోలీస్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, ఎస్సై శ్రావణి లు బ్లూకోల్ట్ సిబ్బంది వీరస్వామి, తరుణ్ కుమార్‌లను అప్రమత్తం చేశారు. దీంతో బ్లూకోల్ట్ సిబ్బంది సదరు వ్యక్తి మొబైల్ ఫోన్ లొకేషన్ ఆధారంగా చింతగట్టు గ్రామ శివారులోని రైల్వే ట్రాక్ ప్రాంతంలో ఉన్నట్లు గుర్తించారు. తక్షణమే అక్కడికి చేరుకుని, రైల్వే ట్రాక్‌పై నిలబడి, ఆత్మహత్యకు ప్రయత్నిస్తున్న వ్యక్తిని గుర్తించి, అప్రమత్తంగా వ్యవహరించి ప్రాణాపాయం నుంచి కాపాడారు. అనంతరం అతడిని తన కుటుంబ సభ్యులకు అప్పగించగా వారు పోలీసులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సమయస్ఫూర్తితో స్పందించి విలువైన ప్రాణాన్ని కాపాడిన బ్లూకోల్ట్ సిబ్బంది వీరాస్వామి, తరుణ్ కుమార్‌లను పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపీఎస్ అభినందించి, నగదు రివార్డులు అందజేశారు. ప్రజల ప్రాణాలు, భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ విధి నిర్వహణలో అంకితభావం, బాధ్యతాయుతంగా పనిచేసే పోలీస్ సిబ్బందిని ఎల్లప్పుడూ ప్రోత్సహిస్తామని ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ జోన్ డిసిపి ధార కవిత, అదనపు డీసీపీ (పరిపాలన) రాయల ప్రభాకర్ రావు, కేయూ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ లు పాల్గొన్నారు.

కొత్తవాడ ఎంజి రోడ్ పోస్ట్ ఆఫీస్ ను తరలించవద్దు

■ సిపిఐ రాష్ట్ర నాయకులు వెంకట్రాములు



వరంగల్, ఆయుధం; వరంగల్ కొత్తవాడ ఎంజీ రోడ్డు లోని సబ్ పోస్ట్ ఆఫీస్ ను తరలించవద్దని సిపిఐ రాష్ట్ర నాయకులు తాటిపాముల వెంకట్రాములు సంబంధిత అధికారులకు ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. కొత్తవాడ తుమ్మలకుంట ఆటోనగర్ ప్రాంతాలలోని వేలాది మంది ప్రజలకు సేవలను అందిస్తున్న సబ్ సబ్ పోస్ట్ ఆఫీస్ ను ఇతర ప్రాంతాలకు తరలించాలని చూడడం ఈ ప్రాంత ప్రజలకు తీరని అన్యాయం చేయడమే అవుతుందన్నారు. కొత్తవాడలోని ఈ పోస్ట్ ఆఫీస్ వలన బీసీ ఎస్సీ ఎస్టీ మైనారిటీ బడుగు బలహీన వర్గాల ప్రజలకు చేనేత కార్మికులకు విద్యార్థులకు రిటైర్డ్ ఉద్యోగులకు ఎంతగానో ఉపయోగపడుతూ విశేషంగా సేవలను అందిస్తున్నదన్నారు. అలాంటి సబ్ పోస్ట్ ఆఫీస్ ను కొత్తవాడ నుండి వేరే ప్రాంతానికి తరలించాలనే ఆలోచనను విరమించుకోవాలని వెంకట్రాములు ఆ ప్రకటనలో సంబంధిత అధికారులను కోరారు.

అయోధ్య రామాలయ సందర్శనకు అఖిలేశ్ యాదవ్ సిద్ధం

■ మండిపడ్డ బీజేపీ



జాతీయం, ఆయుధం: ఉత్తర్‌ప్రదేశ్‌లో వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో స్థానిక రాజకీయాలు ఆసక్తికరంగా మారుతున్నాయి. సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ డిసెంబరు 12న అయోధ్య రామాలయాన్ని సందర్శించనున్నారు. 2024 జనవరిలో ఆలయాన్ని ప్రారంభించినప్పటినుంచి ఆయన ఇక్కడికి రానుండటం ఇదే తొలిసారి. ఎస్పీ నేత, అయోధ్య మాజీ ఎమ్మెల్యే పవన్ పాండే ఈ విషయాన్ని వెల్లడించారు. ''అఖిలేశ్ యాదవ్ డింపుల్ యాదవ్ దంపతులు వచ్చే నెల 12న అయోధ్య రామ మందిరంతోపాటు హనుమాన్ గఢీని సందర్శించనున్నారు. అదేవిధంగా సాధువులను కలిసి వారి ఆశీర్వాదం తీసుకోనున్నారు'' అని తెలిపారు.

అఖిలేశ్ యాదవ్ అయోధ్య పర్యటన ప్రణాళికపై బీజేపీ విమర్శలు ఎక్కుపెట్టింది. గతంలో రామ భక్తులపై కాల్పులు జరిపిన వారు, సాధువులపై లాఠీఛార్జీ చేయించిన వారు, అయోధ్యను విస్మరించిన వారు.. భక్తులకు, సాధువులకు క్షమాపణలు చెప్పిన తర్వాతే రామమందిరాన్ని సందర్శించాలని సీఎం యోగి ఆదిత్యనాథ్ డిమాండ్ చేశారు. శ్రీరాముడు దేశ సంస్కృతికి, విలువలకు ప్రతీక అని, అందరు అంగీకరిస్తారని, కానీ.. ఎవరైనా మారీచుడి వేషంలో వస్తే మాత్రం ఆయన బాణాల నుంచి తప్పించుకోలేరని వ్యాఖ్యానించారు.

జాతీయ ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యాలు సాధించాలి

■ రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలవాలి

■ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అప్పయ్య



హనుమకొండ, ఆయుధం: జిల్లాలో అమలవుతున్న అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహిస్తూ నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అప్పయ్య అధికారులకు సూచించారు. హనుమకొండ జిల్లాలో అమలవుతున్న అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాల పురోగతిపై ఐ డి ఓ సి సమావేశ మందిరంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లాలోని అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాల ప్రోగ్రామ్ అధికారులు, వైద్యాధికారులు, సూపర్‌వైజర్ సిబ్బంది హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ డాక్టర్ అప్పయ్య మాట్లాడుతూ, ప్రత్యేకంగా మాతా శిశు ఆరోగ్య సేవలు పై దృష్టి సారించి, గర్భిణీల ముందస్తు నమోదు, హైరిస్క్ గర్భిణీల గుర్తింపు, వారికి సకాలంలో వైద్య సేవలు అందించడం, సాధారణ ప్రసవాలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆదేశించారు. అదేవిధంగా, చిన్నారులకు అందించే సాధారణ టీకాల వివరాలను UWIN పోర్టల్‌లో ఎప్పటికప్పుడు తప్పనిసరిగా నమోదు చేయాలని, ఏ ఒక్క అర్హత కలిగిన చిన్నారికి కూడా టీకాలు అందకుండా మిగిలిపోకూడదని సూచించారు.

జాతీయ ఆరోగ్య కార్యక్రమాలైన అసంక్రమణ వ్యాధుల నివారణ కార్యక్రమం, జాతీయ క్షయ నివారణ కార్యక్రమం, HIV/AIDS నియంత్రణ కార్యక్రమం, జాతీయ దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల నియంత్రణ కార్యక్రమం అమలులో మరింత పురోగతి సాధించాలని తెలిపారు. ఎన్‌సీడీ కార్యక్రమంలో ప్రజలకు విస్తృతంగా స్క్రీనింగ్ నిర్వహించి, అధిక రక్తపోటు, మధుమేహం, క్యాన్సర్ వంటి వ్యాధులను ముందస్తుగా గుర్తించి, బాధితులకు నిరంతర చికిత్స, ఫాలోఅప్ అందించాలని సూచించారు. క్షయ వ్యాధి అనుమానితులను ముందస్తుగా గుర్తించి పరీక్షలు నిర్వహించడం, బాధితులకు క్రమం తప్పకుండా చికిత్స అందించడం, HIV/AIDS నివారణపై ప్రజల్లో అవగాహన కల్పించడం, దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల నివారణకు ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అన్ని ప్రోగ్రామ్ అధికారులు తమ పరిధిలోని కార్యక్రమాల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని, క్షేత్రస్థాయి సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ లక్ష్యాలను సాధించాలని తెలిపారు. పనితీరులో వెనుకబడిన కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించి, లోపాలను వెంటనే సరిదిద్దుకోవాలని సూచించారు.

హనుమకొండ జిల్లాలో అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేసి, నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయడంతో పాటు రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచే విధంగా ప్రతి ఒక్కరూ సమన్వయంతో కృషి చేయాలని డీఎంహెచ్ఓ డాక్టర్ అప్పయ్య అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ మదన్ మోహన్, డిప్యూటీ జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ప్రదీప్ రెడ్డి, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ రజిత, డాక్టర్ కృష్ణా రావు, డాక్టర్ జ్ఞానేశ్వర్, డాక్టర్ మురళి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కోలా రాజేష్ కుమార్, వైద్యాధికారులు, సూపర్ వై సర్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక విద్యార్థుల ప్రతిభకు వరంగల్ సీపీ ప్రోత్సాహం

■ హ్యాండ్‌మేడ్ వస్తువుల కొనుగోలు



హనుమకొండ, ఆయుధం: హనుమకొండ బాల సముద్రంలోని మల్లికాంబ మనోవికాస కేంద్రానికి చెందిన ప్రత్యేక విద్యార్థులు, కేంద్రం వ్యవస్థాపకురాలు రామలీల, ఈసీ సభ్యుడు కల్యాణ్‌తో కలిసి హనుమకొండ పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో ప్రత్యేక స్టాల్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత, ఐపీఎస్ స్టాల్‌ను సందర్శించి, ప్రత్యేక విద్యార్థులు స్వయంగా తయారుచేసిన హ్యాండ్‌మేడ్ వస్తువులను కొనుగోలు చేశారు. విద్యార్థుల సృజనాత్మకత, నైపుణ్యాలను అభినందిస్తూ వారిని ప్రోత్సహించారు. ప్రత్యేక విద్యార్థులను ప్రోత్సహించడం ద్వారా వారిలో ఆత్మవిశ్వాసం పెంపొందుతుందని పేర్కొన్నారు. అనంతరం ప్రత్యేక విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేసి, దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులతో ఆప్యాయంగా ముచ్చటిస్తూ, వారి ప్రతిభను ప్రోత్సహించడం ఆనందంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ (పరిపాలన) రాయల ప్రభాకర్ రావు, ఎఆర్ అడిషనల్ డీసీపీ సురేష్, ఆర్ఐ(అడ్మిన్) సర్జన్ రాజ్, వెల్ఫేర్ ఆర్ఐ సతీష్, ఆర్ఐ శ్రీధర్, మల్లికాంబ మనోవికాస కేంద్రం సిబ్బంది, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు అండగా 'గంట రవికుమార్ ఫౌండేషన్'

■ శివనగర్ ప్రభుత్వ పాఠశాల పదో తరగతి విద్యార్థుల పరీక్ష ఫీజుల చెల్లింపు



వరంగల్, ఆయుధం: ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఏ ఒక్క పేద, మధ్యతరగతి విద్యార్థి కూడా చదువుకు దూరం కాకూడదనే గొప్ప సంకల్పంతో 'గంట రవికుమార్ ఫౌండేషన్' నిరంతరం విద్యాభివృద్ధికి అండగా నిలుస్తోందని ఫౌండేషన్ సభ్యులు తెలిపారు. గంట రవికుమార్ ఆదేశాల మేరకు వరంగల్ జిల్లాలోని శివనగర్ ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న 60 మంది విద్యార్థినీ విద్యార్థులకు సంబంధించిన పరీక్ష ఫీజును ఫౌండేషన్ సభ్యులు స్వయంగా చెల్లించారు. ఈ ఫీజుకు సంబంధించిన బ్యాంక్ చెక్కును ఫౌండేషన్ సభ్యులు మహమ్మద్ రఫీ, కందుకూరి విజయ్ కుమార్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నరేంద్ర స్వామి కి శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ సభ్యులు మాట్లాడుతూ.. సమాజంలో పేద విద్యార్థులు చదువులో వెనుకబడకుండా, వారి భవిష్యత్తుకు బాటలు వేయడమే లక్ష్యంగా గంట రవికుమార్ సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారని తెలిపారు.

గత సంవత్సరంలో కూడా పేద విద్యార్థులకు పరీక్ష ఫీజులు అందజేయడంతో పాటు, పేద, మధ్యతరగతి కుటుంబాల విద్యార్థుల కోసం ఉచిత ట్యూషన్ సెంటర్ ను ఏర్పాటు చేసి వారి ఉన్నత చదువులకు ఎంతగానో తోడ్పాటు అందించామని గుర్తుచేశారు. గంట రవికుమార్ చేస్తున్న ఇటువంటి నిరంతర విద్యా సేవలను ఉపాధ్యాయులు మరియు విద్యార్థుల తల్లిదండ్రులు కొనియాడారు.

ఐఎల్ పిఎ 6వ రాష్ట్ర సదస్సును జయప్రదం చేయండి

■ ఐఎల్ పిఎ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ చిల్ల రాజేంద్ర ప్రసాద్



హనుమకొండ, ఆయుధం: హనుమకొండ జిల్లా కేంద్రం 'డి' కన్వెన్షన్ లో ఈ నెల నవంబర్ 14 న జరుగు ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ తెలంగాణ 6వ రాష్ట్ర సదస్సుకు రాష్ట్రంలోని న్యాయవాదులు పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేయాలని ఐఎల్ పిఎ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ, సదస్సు కన్వీనర్ చిల్ల రాజేంద్ర ప్రసాద్ పిలుపునిచ్చారు. శనివారం మహబూబాబాద్ జిల్లా తొర్రూరు, మహబూబాబాద్ వరంగల్ జిల్లా నర్సంపేట కోర్టులలో న్యాయవాదులు, బార్ అసోసియేషన్ నాయకులు, ఐ ఎల్ పి ఎ నాయకులతో కలిసి గోడ పత్రికలను, కరపత్రాలను ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. అంబేద్కర్ పిలుపునిచ్చిన 'పే బ్యాక్ టు సొసైటీ' లక్ష్యంగా నల్ల కోట్లతో నీలి విప్లవం నినాదంతో ఐఎల్ పిఎ పని చేస్తుందని మహాత్మ జ్యోతిరావు పూలే, అంబేద్కర్ సిద్ధాంత పునాదితో నిరంతరం బహుజన అణగారిన పేద న్యాయవాదుల వృత్తి నైపుణ్యం కోసం కృషి చేస్తూనే బహుజన సమాజ చైతన్యం కోసం పని చేస్తున్నామని అన్నారు. సాంస్కృతిక విప్లవం విజయవంతం కాకుండా బహుజన సమాజ విముక్తి జరగదని, భారత రాజ్యాంగం న్యాయవాదులకు ఉపయోగపడే గ్రంథమే కాదని బడుగు బలహీన వర్గాల జీవితాలను మార్చే స్ఫూర్తిదాయక వాహనమని అలాంటి రాజ్యాంగ స్ఫూర్తిని గ్రామగ్రామానికి తీసుకెళ్లడమే ఐఎల్ పిఎ లక్ష్యమని ఆయన అన్నారు.

బి.సి మోర్చా జాతీయ అధ్యక్షులు చౌదరి వికాస్ పటేల్ అధ్యక్షతన జరుగు సదస్సుకు ముఖ్య అతిథిగా విశ్రాంత హైకోర్టు జడ్జి, తెలంగాణ రాష్ట్ర సీనియర్ సిటిజన్స్ కమీషన్ కమీషనర్ జస్టిస్ ఈద తిరుమలదేవి హాజరవుతున్నారని, గౌరవ అతిథులుగా వరంగల్, హనుమకొండ జిల్లా జడ్జిలు వి.బి. నిర్మలా గీతాంబ, ఎం.ఆర్. సునీత లు, పంచాయతీ రాజ్ మంత్రి దనసరి అనసూయ సీతక్క, వరంగల్ పచ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, హాజరవుతున్నారని తెలిపారు. 79 ఏండ్ల స్వాతంత్ర భారతంలో మహిళా స్వేచ్ఛ అనే అంశంపై ప్రొఫెసర్ ఇ. సుధారాణి, ఎస్ ఐ ఆర్ పేరుతో ఓట్ల తొలగింపు అనే అంశంపై ప్రొఫెసర్ గుగులోతు వీరన్ననాయక్, సామాజిక న్యాయం బహుజనుల ఐక్యత అనే అంశంపై తెలుగు అకాడమీ రాష్ట్ర చైర్మన్ ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ, ప్రజాస్వామ్యంలో జడ్జిల నియామకం లోపాలు అనే అంశంపై ఐ ఎల్ పి ఎ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు పొన్నం దేవరాజు గౌడ్ ఉపన్యాసాలు ఇస్తారని తెలిపారు. వీరితో పాటు ఐ ఎల్ పి ఎ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షులు ఎన్ జె శాంసన్, కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ వి. రామచంద్రం, మెటుపల్లి సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ దయ రాజారాం, బహుజన ముక్తి పార్టీ జాతీయ అధ్యక్షులు దాసురాం నాయక్, రాష్ట్రీయ ముక్తి మోర్చా జాతీయ ప్రధాన కార్యదర్శి ముఫ్తీ మహమ్మద్ ఫహీమొద్దీన్, ప్రొఫెసర్ డాక్టర్ కూరపాటి రమేష్, ప్రొఫెసర్ వెంకయ్య, ప్రొఫెసర్ ఈసం నారాయణ, ప్రొఫెసర్ నిమ్మసుదర్శన్, ఆదర్శ విద్యా సంస్థ చైర్మన్ బూర విద్యాసాగర్, బ్యాంసెఫ్ రాష్ట్ర అధ్యక్షులు డి.నరేందర్, బ్యాంసెఫ్ నాయకులు ఎ.సంతోష్ కుమార్, ఐఎల్ పిఎ నాయకులు తిప్పన దాంగే, తీగల జీవన్ గౌడ్, వి.ఎం. కృష్ణారెడ్డి, గజ్జల వెంకట్ రెడ్డి, అనంత ఆంజనేయులు, భానుప్రియ, చిల్ల రమేష్, టి.దేవిడ్, మహమ్మద్ ముధసిర్ అహ్మద్, వెంకటయ్య ముదిరాజ్ తదితర మేధావులు హాజరవుతారని తెలిపారు. ఈ ప్రచార కార్యక్రమంలో ఐఎల్ పిఎ రాష్ట్ర కమిటి సభ్యులు ఎగ్గడి సుందర్ రామ్, వరంగల్ జిల్లా అధ్యక్షులు విలాసాగరం సురేందర్ గౌడ్, తొర్రూరు బార్ అసోసియేషన్ అధ్యక్షులు వి. వెంకటరత్నం, ఉపాధ్యక్షులు నాగేశ్వర్, ప్రధాన కార్యదర్శి టి.సైదులు, మహబూబాబాద్ బార్ అధ్యక్షులు మామిడాల సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి జంగం సిద్ధార్థ, ఐ ఎల్ పి ఎ తొర్రూరు బార్ అధ్యక్షులు వలపు మధుసూదన్, కలవకొలను ప్రవీణ్ రాజు, తొర్రూరు న్యాయవాదులు పల్లవి, నాగరాజు, చంద్రయ్య, మహేష్, ఐలోని, శ్రీధర్, యాకేందర్, రమేష్, మహబూబాబాద్ న్యాయవాదులు ఆరేళ్లి శ్రీనివాస్, దర్శనం రామకృష్ణ, బాలాజి, ప్రభాకర్ రెడ్డి, శ్రీనివాస్, వాసం ఆనంద్, రాజమణి, మందుల శ్రీనివాస్, హరిబాబు, నర్సంపేట న్యాయవాదులు అంబటి శ్రీనివాస్, షేక్ రహీమొద్దీన్, దొంతి సాంబయ్య, మోటూరి రవి, రోజ, పండగ శ్రీనివాస్, శివ తదితరులు హాజరయ్యారు.

క్రమశిక్షణే సైనికుడిని యోధుడిగా మారుస్తుంది

(మొదటి పేజీ తరువాయి..)

చేసుకునేలా మన దళాలు మరింత మెరుగవ్వాలి. మీ అందరి సహకారంతో భారత్ మరింత ముందుకు వెళ్తుందని నాకు పూర్తి నమ్మకం ఉంది' అని రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు.

దేశంలో పెరుగుతోన్న రక్షణ ఉత్పాదక సామర్థ్యాలను రాజ్‌నాథ్ సింగ్ ప్రశంసించారు. 'ఆత్మనిర్భర్ భారత్' దిశగా కేంద్ర ప్రభుత్వం చేస్తున్న కృషి వల్లే దేశీయ స్టార్టప్‌లు, పరిశ్రమలు.. డ్రోన్‌లు, డ్రోన్ నిరోధక వ్యవస్థలు, సైనికుల కోసం అధునాతన పరికరాలను అభివృద్ధి చేస్తున్నాయన్నారు. భవిష్యత్తులో అన్ని రకాల ఆయుధాలు, క్షిపణులను సొంతంగా తయారు చేసుకునే స్థాయికి భారత్ ఎదగాలనేదే తమ లక్ష్యమని పేర్కొన్నారు. అదే సమయంలో దేశ సరిహద్దుల్లో సైనికులు అక్కడి ప్రజలతో బలమైన సంబంధాలు కొనసాగించాలని రక్షణ మంత్రి సూచించారు. అలా అయితేనే దేశంలో కల్లోలం సృష్టించేందుకు శత్రువులు చేసే ప్రయత్నాలను తిప్పికొట్టగలమన్నారు.

హిందూ బంధువులందరికీ దీపావళి శుభాకాంక్షలు

■ బీజేపీ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్



వరంగల్, ఆయుధం: వరంగల్ జిల్లాలోని హిందూ బంధువులందరికీ, ప్రజలందరికీ దీపావళి పండుగ శుభాకాంక్షలు అని భారతీయ జనతా పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చీకటిపై వెలుగు, చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే ఈ దీపాల పండుగ, ప్రతి ఒక్కరి జీవితాల్లో సరికొత్త వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. లక్ష్మీదేవి అనుగ్రహంతో వరంగల్ జిల్లాలోని ప్రతి ఇల్లు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, ఐశ్వర్యంతో విలసిల్లాలని కోరుకున్నారు. సనాతన ధర్మ సంప్రదాయాలను గౌరవిస్తూ, ఈ పండుగను కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి ఆనందోత్సాహాల మధ్య, సురక్షితంగా జరుపుకోవాలని గంట రవికుమార్ జిల్లా ప్రజలకు విజ్ఞప్తి చేశారు.



బొండపల్లిలో మాజీ మంత్రి బొత్స కుమార్తె ఓటమి

బొండపల్లి, ఆయుధం: పరిషత్ పోరులో కూటమి విజయపరంపర కొనసాగుతోంది. విజయనగరంజిల్లాలోని బొండపల్లి జడ్పీటీసీ స్థానంలో తెదేపా అభ్యర్థి గెలుపొందారు. ఇక్కడి నుంచి పోటీ చేసిన వైకాపా నేత, శాసనమండలిలో ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ కుమార్తె అనూష ఓటమి పాలయ్యారు. బొత్స అనూషపై తెదేపా అభ్యర్థి పాశల నీరజ 5,136 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. నీరజ విజయంతో బొండపల్లిలో కూటమి శ్రేణులు సంబరాలు చేసుకుంటున్నాయి. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ రేసులో ఉన్న అనూష ఓటమి పాలవడంతో వైకాపా శ్రేణులు డీలాపడ్డాయి. వైకాపా సీనియర్ నేత బొత్స సత్యనారాయణ కుటుంబం నుంచి నలుగురు జడ్పీటీసీ అభ్యర్థులుగా బరిలోకి దిగాలని ప్రయత్నించారు. పూసపాటిరేగ జడ్పీటీసీ స్థానానికి బొత్స తమ్ముడి కుమారుడు చైతన్య నామినేషన్ తిరస్కరణకు గురైంది. బొండపల్లి నుంచి కుమార్తె అనుష, గరివిడి నుంచి కోడలు బొత్స పూజిత, గుర్ల మండలం నుంచి బొత్స సోదరి సంగంరెడ్డి వెంకటలక్ష్మి పోటీ చేశారు. స్థానిక ఎన్నికలకు ముందు తెదేపాలో చేరిన బొత్స మేనల్లుడు మజ్జి శ్రీనివాసరావు(చిన్నశ్రీను) కుమార్తె సిరి సహస్ర తెర్లాం జడ్పీటీసీ స్థానం నుంచి విజయం సాధించారు.



తాగునీటితో ఫ్లోర్‌క్లీనింగ్..

■ అక్షయకల్ప ఫార్మ్స్ అండ్ ఫుడ్స్‌కు రూ.20వేల జరిమానా

హైదరాబాద్, ఆయుధం: తాగునీరు వృథా చేస్తున్న వారిపై జలమండలి కఠిన చర్యలు చేపడుతోంది. ఫ్లోర్ క్లీనింగ్‌కు తాగునీరు వాడినందుకు రూ.20 వేల జరిమానా విధించింది. జూబ్లీహిల్స్‌లోని అక్షయకల్ప ఫార్మ్స్ అండ్ ఫుడ్స్ సంస్థపై ఈమేరకు చర్యలు చేపట్టింది. జరిమానాతో పాటు తాగునీటి కనెక్షన్‌ను తాత్కాలికంగా తొలగించింది. ఇప్పటికే నీటి వృథాపై దృష్టి సారించిన జలమండలి.. హైదరాబాద్‌లోని పలు పబ్‌లు, హోటళ్లకు జరిమానాలు విధించింది. హైదరాబాద్ మహానగరంలో తాగునీటి దుర్వినియోగం, నీటి వృథాపై పౌరులు ఫిర్యాదు చేసేందుకు వీలుగా జలమండలి 'పానీ' యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. పానీ యాప్‌ను నగరవాసులు డౌన్‌లోడ్ చేసుకుని నీటిని వృథా చేసే వారిపై ఫిర్యాదు చేయాలని కోరింది.

Edited, Printed, Published and Owned by **V.P.CHANDER.** On Behalf of **VNR MEDIA**. Printed at Pragathi Graphics # 6-8-231, Sagara Veedhi, Hanumakonda.
Published at 2-2-414, Nayeem Nagar, Hanumakonda, TS-506001. RNI: TEL TEL 2019/78717, Email: ayudamdaily@gmail.com. Contact: 98480-15695